www.aksharatoday.com

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND








28-4-2025 (MONDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2


## పచ్చని పల్లెల్లో

# మైక్రో పడగ



- సూక్ష్మ రుణాలు ఇచ్చి నిండా ముంచుతున్న కంపెనీలు..!
- సమయానికి చెల్లించకపోతే వేధింపులు

**పల్లెల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్ పడగ విప్పుతోంది. మహిళలు, చిరువ్యాపారులకు రుణాలు ఇస్తూ వారిని నిండా ముంచుతున్నారు వడ్డీ వ్యాపారులు. అత్యసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి.. తీరా ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోతే వేధింపులకు గురి చేస్తున్నారు. గతంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులు తాళలేక ఎంతోమంది ఆత్మహత్య చేసుకున్న ఘటనలున్నాయి. అప్పట్లో ప్రభుత్వం వీటిని నిషేధించింది. మళ్లీ గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్‌లు తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.** - అక్షరటుడే, కామారెడ్డి

మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు ముందుగా తమ ఏజెంట్లను గ్రామాల్లోకి పంపి, పేద మహిళలు, సంఘాల సభ్యులను కలుస్తున్నారు. వారం, 15రోజుల వాయిదా చెల్లింపులతో రుణాల ఆశ చూపుతున్నారు. పది నుంచి 12 మంది మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసి, 15 రోజుల్లోనే రుణం అందిస్తున్నారు. ఒక్కో గ్రామంలో 20 నుంచి 30 గ్రూపులు ఏర్పడి రుణాలు పొందినట్లు తెలుస్తోంది.

కామారెడ్డి నియోజకవర్గంలోని రామారెడ్డి, సదాశివనగర్, భిక్కనూర్, దోమకొండ మండలాల్లో ఈ తరహా రుణాలు ఎక్కువగా ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈజీగా రుణం వస్తుండడంతో మహిళలు వీటికి ఆకర్షితులవుతున్నారు. తీరా ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐ చెల్లించకపోతే వేధింపులకు గురి చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలోనూ పలు మండలాల్లో మైక్రో ఫైనాన్స్ ఆగడాలు పెరిగిపోయాయని బాధితులు చెబుతున్నారు.

### కట్టడిలో విఫలం..

గ్రామాల్లో మైక్రో ఫైనాన్స్‌లు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నా.. సంబంధిత అధికారులు ముందుగా నిలువరించడంలో విఫలమవుతున్నారు. గతంలో మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులతో ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకముందే అధికారులు కళ్లు తెరవాల్సి ఉంది. మైక్రో ఫైనాన్స్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.



## నవీపేట్‌లో ప్రశాంతంగా బంద్

**అక్షరటుడే, బోధన్:** నవీపేట మండల కేంద్రంలో సోమవారం బంద్ పాటించారు. పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా హిందూ ఐక్యవేదిక సమితి బంద్ ప్రకటించింది. దీంతో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసి ఉంచారు. బంద్‌లో హిందూ ఐక్యవేదిక సమితి సభ్యులు పాల్గొన్నారు.



## విఠలేశ్వరుడిని దర్శించుకున్న పోచారం

**అక్షరటుడే, బాన్సువాడ:** మహారాష్ట్రలోని పండరీపూర్‌లో రుక్మిణి పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పోచారానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం విఠలేశ్వరుని భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట అంజిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

## మెడికల్ కళాశాలల్లో నియామకాలు చేపట్టాలి

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల్లో వెంటనే నియామకాలు చేపట్టాలని టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడు అలుక కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో టీజీవో అసోసియేషన్ సమావేశం, సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అన్ని మెడికల్ కళాశాలల్లో సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రావు, దేవి సింగ్, ఉపాధ్యక్షుడు రాములు, సంయుక్త కార్యదర్శి నాగమోహన్, అర్బన్ యూనిట్ అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి జగదీశ్, నాగరాజు, మెడికల్ కళాశాలల వైద్యులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పనిచేసే హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్‌సింగ్ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి రూ.16 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. దీంతో సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య బాధిత కుటుంబీకులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ(ఏఆర్) రామచంద్రరావు, ఏవో అనిసాబేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ వనజ, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాకు మంత్రి పొంగులేటి రాక



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జిల్లాకు రానున్నారు. లింగంపేట మండలం షెట్‌పల్లిలో జరుగనున్న భూభారతి సదస్సుకు హాజరు కానున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద లింగంపేట్ మండలాన్ని ఎంపిక చేసిన విషయం తెలిసిందే.. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సదస్సుల ద్వారా భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.



కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**అక్షరటుడే, నిజాంసాగర్:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్లు అందజేయాలని అధికారులను సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఇప్పటివరకు వచ్చిన ధాన్యం, కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులు మాట్లాడుతూ లారీల కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ భిక్షపతి, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులున్నారు.

## 'భూభారతి'తో రికార్డుల్లో పారదర్శకత

**అక్షరటుడే, నిజాంసాగర్:** కొత్తగా వచ్చిన భూభారతి చట్టం ద్వారా భూరికార్డుల్లో పారదర్శకత ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్యేలు కలిసి ఎడ్లబండిపై నిజాంసాగర్ తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చారు. అనంతరం నిర్వహించిన భూభారతి అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా భూసమస్యలన్నింటినీ సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, కాంగ్రెస్ నిజాంసాగర్ మండలాధ్యక్షుడు మల్లికార్జున్, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ తహశీల్దార్లు భిక్షపతి, సవాయి సింగ్, నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

### ప్రతిరైతుకు అవగాహన ఉండాలి..

**అక్షరటుడే, బోధన్:** భూభారతి చట్టంపై ప్రతిరైతుకు అవగాహన ఉండాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ధరణిలో జరిగిన తప్పిదాలకు భూభారతి చట్టంతో పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

# ‘సాగర్’లో మిగిలింది 5.7 టీఎంసీలే..

**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ ఆయకట్టు కింద యాసంగి సీజన్ ముగిసింది. ఈ సీజన్‌లో ప్రాజెక్టు నుంచి 1.25 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించారు. డిసెంబరు 13 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆరు విడతల్లో 10.4 టీఎంసీల నీటిని విడుదల చేశారు. యాసంగి పంటలు కోతలు దాదాపు పూర్తవడంతో ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ఈ నెల 10న నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం జలాశయంలో 5.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



జూన్ వరకు మరో 1.5 టీఎంసీల నీరు ఆవిరి అయినా 4.3 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

### ఆరు విడతల్లో 10.4 టీఎంసీలు విడుదల

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో నిజాంసాగర్ పూర్తిస్థాయిలో నిండింది. డిసెంబరులో కూడా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.802 టీఎంసీలు)తో నిండుకుండలా ఉంది. కాగా.. ఆయకట్టు కింద సాగయ్యే పంటల కోసం అధికారులు ఆరు విడతల్లో 10.4 టీఎంసీల నీటిని విడుదల చేశారు. అలాగే 1.4 టీఎంసీలు ఆవిరి రూపంలో పోయింది. ప్రస్తుతం 5.71 టీఎంసీలు నిల్వ ఉంది.

### వర్షాలు కురిస్తేనే..

వానాకాలంలో త్వరగా నారుమడులు వేస్తే వరి సాగు కోసం జూన్, జూలై మాసాల్లో రెండు, మూడు విడతల్లో నీటిని విడుదల చేస్తాం. వర్షాలు కురిస్తేనే వానాకాలం పంటలు పండుతాయి. **- శ్రీనివాస్, సీఈ, నీటి పారుదల శాఖ**

## రైతులు నష్టపోకుండా చూడాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆరుగాలం కష్టపడి ధాన్యాన్ని పండించిన రైతులు నష్టపోకుండా చూసే బాధ్యత అధికారులదేనని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. నందిపేట్ మండలంలోని బాద్గుణ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఒకవైపు గన్నీబ్యాగుల కొంత, తూకాలు ఆలస్యం అవుతుంటే.. మరోవైపు అకాల వర్షాలు రైతులను ముంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నందిపేట్ మండలాధ్యక్షుడు రాజు, సురేష్, కంఠం, సాయికుమార్ తదితరులున్నారు.

## ఆరోగ్య సమస్యలపై అవగాహన సర్వే



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రజల మానసిక స్థితి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు బాన్సువాడ ఏరియా ఆస్పత్రి వైద్యుడు విజయ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో బీబీనగర్ ఎయిమ్స్ బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మానసిక ఒత్తిడి, ఆత్మహత్యా ప్రవర్తన, వ్యసనానికి సంబంధించిన రుగ్మతలపై సమాచారం సేకరిస్తున్నట్లు వారి తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో పోస్టర్లను ఆవిష్కరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దయానంద్, ఎయిమ్స్ బృందం సభ్యులు వెంకట్, శ్రీధర్, రంజిత్, గ్రేస్, మాధురి తదితరులున్నారు.

## ఊర చెరువులో పడి వ్యక్తి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన ఆలూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్ గ్రామానికి చెందిన పుట్ట నవీన్(41) నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సోమవారం అతడి మృతదేహం ఊరుచెరువులో లభ్యమైంది. నవీన్ వారంరోజులుగా కడుపు నొప్పిగా బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మామను హత్య చేసిన అల్లుడు

**అక్షరటుడే, బోధన్:** కుటుంబ తగాదాలతో మామను అల్లుడు హత్యచేసిన ఘటన నవీపేట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో ఓ గోదాం నిర్మాణం నిమిత్తం ఛత్తీస్‌గఢ్ నుంచి రాజేష్ కుటుంబం వలస వచ్చింది. అయితే రాజేష్ తన భార్యను ఇబ్బందులకు గురిచేస్తుండడంతో.. మామ బిలావ్‌సింగ్ అడ్డుపడేవాడు. ఈ విషయంలో రెండు రోజుల క్రితం మామఅల్లుళ్ల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో క్షణికావేశంలో మామపై అల్లుడు రాజేష్ ఇటుకలతో దాడి చేశాడు. దీంతో మామ బిలావ్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

## సిద్దులగుట్టపై ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండ గృహలోని శివలింగానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, స్వామి వారి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని బేతాల స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. పురాతనమైన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని, ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేయాలన్నారు. మాసాని శ్రీనివాస్ రెడ్డి, మంత్రి గణేష్, ఎస్టీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ అంబర్ సింగ్, వెంకట రెడ్డి, జనార్దన్ రెడ్డి, బండి సాయిలు, నవీన్ రెడ్డి తదితరులున్నారు.

## పార్ట్‌టైం లెక్చరర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి



**అక్షరటుడే, భిక్కనూరు:** తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ పార్ట్‌టైం లెక్చరర్లు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏడో రోజు సమ్మెలో భాగంగా సోమవారం గాంధీ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగభద్రత లేక అధ్యాపకులు ఆందోళనతో ఉన్నారన్నారు. తక్షణమే జీవో.21ను సవరించి తమ సర్వీసులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

**అక్షరటుడే, బిచ్కుంద:** మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ హెడ్‌మాస్టర్ దత్తా గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 15వరకు పాఠశాల ఆవరణలో ఉదయం 9గంటల నుంచి 12 వరకు క్యాంప్ ఉంటుందన్నారు. 6వ తరగతి నుంచి 9వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు క్యాంప్‌లో శిక్షణ పొందవచ్చని సూచించారు. యోగా, స్పోకెన్ ఇంగ్లిష్ విషయాల్లో ప్రత్యేక శిక్షకుడి ద్వారా తర్ఫీదునిస్తామని పేర్కొన్నారు. ఉచితంగా స్నాక్స్ కూడా అందజేస్తామని వివరించారు. 1న ఉదయం ప్రభుత్వ పాఠశాలలో ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి క్యాంప్‌ను ప్రారంభిస్తారని తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన షేక్ హైమదీ బేగం మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. దీంతో ఆమె చికిత్స నిమిత్తం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రూ. 4లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా హైమదీ బేగం కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే..



**అక్షరటుడే, బిచ్కుంద:** రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సభను సక్సెస్ చేసినందుకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ జుక్కల్ నుంచి ప్రజలు తరలివచ్చారన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని సామాజిక కార్యకర్త ఎంఏ హకీం అన్నారు. గోల్డెన్ జిమ్ నిర్వాహకుడు పబ్బ శేఖర్ వారి నానమ్మ, తాతయ్య పబ్బ సాయన్న, లాలవ్వ జ్ఞాపకార్థం సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండాకాలం వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాములు, నవీన్, మోహన్, పీరాజీ, గంగారాం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తాం



**అక్షరటుడే, నిజాంసాగర్:** గ్రంథాలయాల్లో వసతులు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నిజాంసాగర్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ మనోజ్ కుమార్, కాంగ్రెస్ నిజాంసాగర్ మండలాధ్యక్షుడు ఏలె మల్లికార్జున్, నాయకులు రాము రాథోడ్ ఉన్నారు.

## నగరంలో కారు బీభత్సం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. బైపాస్ నుంచి జీజీ కళాశాల వెళ్లే రోడ్డులో చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో డ్రైవర్ కారును వేగంగా నడుపుతూ.. రోడ్డు పక్కన టోపీలు విక్రయిస్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. అనంతరం ఓ లూనాను కూడా ఢీకొట్టి తర్వాత డ్రెయినేజీ గోడకు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో టోపీలు విక్రయిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

